
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 19 జూన్ 2024 | 5

కొమ్మనాపల్లిలో తగ్గి.. బెండపూడిలో పెరిగిన డయేరియా కేసులు - 7లో
రత్నగిరి ప్రకాష్‌సదన్‌లో నల్లుల బెడద - 7లో

అన్నీ కాకమ్మ కబుర్లే


ఇలా ఉన్న పనులతో హార్బర్ ప్రారంభించేస్తామంటూ అబద్ధాలాడిన జగన్

- అయిదేళ్లయినా ఉప్పాడ అమీనాబాద్ ఫిషింగ్ హార్బర్ పూర్తికాలే
- మత్స్యకారులకు మేలు చేసే హార్బర్‌పై గత జగన్ ప్రభుత్వం అబద్ధాలపై అబద్ధాలు
- నిధులు విడుదల చేయకుండా ఏళ్ల తరబడి బాధ్యతారాహిత్యంగా నాన్చివేత
- కొత్తగా ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వంపైనే ఇప్పుడు మత్స్యకారుల ఆశలన్నీ..
- సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని కోరుతున్న మత్స్యకారులు
- కాంట్రాక్టర్‌కు నిధులు ఇవ్వకపోవడంతో ఏడాదిగా ఎక్కడి పనులు అక్కడ నిలిపివేత
- టీడీపీ హయాంలోనే రూ.300కోట్లతో పురుడుపోసుకున్న కొత్త హార్బర్ ప్రతిపాదన
- తిరిగి మళ్లీ టీడీపీ సర్కారు ప్రారంభించాల్సిన పరిస్థితి
- పనులు పూర్తవకున్నా అదిగో ఇదిగో అంటూ వైసీపీ నాలుగుసార్లు ప్రారంభోత్సవ గడువులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

మోసం.. నిలువునా మోసం.. నోరువిప్పితే అబద్ధాలు.. పైసా నిధులు విదల్చకుండానే ప్రారంభోత్సవ తేదీలంటూ నమ్మబలికే మాటలు.. తీరా క్షేత్రస్థాయిలో పనులు జరగకపోయినా అదిగో పూర్తయిపోతుందంటూ కల బొల్లి కబుర్లు.. ఇలా ఒకటికాదు రెండు కాదు ఏకంగా నాలుగున్నరేళ్లపాటు గత జగన్ ప్రభుత్వం జిల్లాలో మత్స్యకారులను నిలువునా మోసం చేసింది. కాకమ్మ కథలతో కాలక్షేపం చేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించింది. దీంతో ఉప్పాడ సమీపంలోని అమీనాబాద్ ఫిషింగ్‌హార్బర్ ఇప్పటికీ పూర్తి కాలేదు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పురుడుపోసుకున్న ఈ హార్బర్ ప్రతిపాదన చివరకు మళ్లీ కొత్తగా కొలువుదీరిన టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేయాల్సిన పరిస్థితి. మధ్యలో ఈ అయిదేళ్లలో జగన్ ప్రభుత్వం నిత్యం పచ్చి అబద్ధాలతో హార్బర్ నిర్మాణాన్ని గాలి మాటలకు పరిమితం చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అంతులేని జాప్యంతో నత్తనడకగా మారిన కొత్త హార్బర్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వమే ఎలాగైనా పూర్తిచేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు అలవోకగా అబద్ధాలు..

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలోని అమీనాబాద్ వద్ద కొత్తగా హార్బర్ నిర్మించాలని 2018 చివర్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భావించింది. దీనికి సంబంధించి ప్రాజెక్టు వ్యయంపై అధ్యయనం చేయించింది. అందులో భాగంగా హార్బర్ నిర్మాణానికి రూ.300కోట్ల వరకు వెచ్చించడానికి కార్యాచరణ సిద్ధం చేసింది. టెండర్ల ప్రక్రియకు సన్నాహాలు మొదలు పెట్టిన సమయంలో అప్పట్లో ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో కొంతకాలం దీన్ని పక్కన పడేసిన జగన్ ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన అంచనాలను సవరించింది. తిరిగి కొత్తగా అంచనాలు మార్చి రూ.422కోట్లకు వ్యయం పెంచి 2020లో టెండర్లు పిలిచింది. టెండర్ల ప్రక్రియలో జగన్ ప్రభుత్వం తనకు కావాల్సిన కంపెనీకి పనులు కట్టబెట్టేలా పావులు కదిపింది. ఇందులోభాగంగా ఉప్పాడతోపాటు రాష్ట్రంలో మరో మూడు హార్బర్‌లకు కలిపి ఒకేసారి పనులన్నీ హైదరాబాద్‌కు చెందిన ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అనే కంపెనీకి ఇచ్చింది. అప్పటినుంచి హార్బర్‌కు గ్రహణం పట్టింది. ఈ కంపెనీ నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె హార్బర్ పనులు కూడా దక్కించుకోవడంతో అమీనాబాద్ హార్బర్‌ను గాలికి వదిలేసింది. ఈ కంపెనీకి జువ్వలదిన్నె పనుల బిల్లులు సరిగ్గా ఇవ్వకపోవడంతో ఇక్కడ అసలు నిర్మాణాలే ప్రారంభించలేదు. కానీ జగన్ ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా ఉండేందుకు ప్రాజెక్టు జాప్యానికి హార్బర్ నిర్మించనున్న అమీనాబాద్‌వద్ద అలల ఉధృతి అధికంగా ఉందంటూ ఏడాదిపాటు కుంటిసాకులు చెప్పింది. రాను రాను హార్బర్ ఆలస్యం కావడంతో విమర్శలు పెరిగాయి. దీంతో జగన్ 2020, నవంబర్ 21న ఉప్పాడ హార్బర్ నిర్మాణానికి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. 2022లో దీన్ని ప్రారంభిస్తామని అప్పట్లో గొప్పలు చెప్పారు. కానీ శంకుస్థాపన తర్వాత కూడా నిధులు రాకపోవడంతో కాం ట్రాక్టర్ పనులు ఆపేశారు. ఈలోపు ప్రారంభోత్సవ గడువు దగ్గరపడడంతో 2021, ఏడాది చివర్లో సముద్రం అడుగు నుంచి రాళ్ల ఫిల్లింగ్ పనులు ప్రారంభించారు. హార్బర్ బయట శీతల గోదాములు, ఇతర నిర్మాణాలు మొదలుపెట్టారు. కానీ అప్పటికే సీఎం చెప్పిన ప్రారంభోత్సవ గడువు దగ్గరకు వచ్చేసినా పనులు 30శాతం జరగలేదు. కానీ వాస్తవాలను మభ్యపెట్టి 2022లో ప్రారంభోత్సవం ఉంటుందని అప్పట్లో అమరావతినుంచి వచ్చిన ఉన్నతాధికారుల బృందం ప్రకటించింది. ఆ తర్వాత పాత జిల్లా కలెక్టర్‌లు మురళీధర్‌రెడ్డి, హరికిరణ్‌లు ఇక్కడకు వచ్చినప్పుడు కూడా ఇదే మాట చెప్పారు. కానీ 2022 గడువు కూడా దాటిపోయింది. అయినా పనులు కదలక ప్రారంభోత్సవ ప్రకటన డొల్లగా మారిపోయింది. ఆ తర్వాత మళ్లీ ప్రభుత్వం మాట మార్చి 2023, మార్చికి హార్బర్‌ను ప్రారంభిస్తామని ఇంకోసారి గొప్పలు చెప్పింది. చివరకు ఆ గడువు కూడా దాటిపోయింది. పనులు ఏవీ సగం కూడా అవలేదు. దీంతో తూచ్ అంటూ 2023, అక్టోబర్‌కు కచ్చితంగా ప్రారంభిస్తామని ప్రభుత్వం ఇంకోసారి గడువు పొడిగించింది. అప్పట్లో మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పనులు జరుగుతున్న హార్బర్ ప్రాంతం వద్దకు వచ్చి మళ్లీ అదే పాటపాడారు. చివరకు ఎన్నికల సమయం దగ్గరపడినా ఫిష్ హ్యాండ్లింగ్, వేలం హాలు, ట్యునాఫిష్ హ్యాండ్లింగ్, ప్యాకింగ్, ఫిష్ డ్రైయింగ్ యార్డ్, మత్స్యకారులకు శిక్షణ కేంద్రం, వలల మెండింగ్ షెడ్, బోట్ల మరమ్మతు కేంద్రం, ఐస్‌ప్లాంట్, కోల్డ్ స్టోరేజీలు ఏవీ పూర్తికాలేదు.ఇలా అడుగడుగునా అబద్ధాలు, నయవంచక మాటలతో వైసీపీ ప్రభుత్వం నిలువునా అందరినీ మోసం చేసింది. అటు కాంట్రాక్టరేమో తనకు రూ.150 కోట్ల వరకు బిల్లులు ఆగిపోవడంతో ప్రభుత్వం తీరుపై విసిగి ఎక్కడి పనులు అక్కడే ఆపేసి వెళ్లిపోయాడు.

ఆశలన్నీ కొత్త ప్రభుత్వంపైనే...

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొత్తగా కొలువుదీరడంతో ఇప్పుడు మత్స్యకారులందరి ఆశలు సీఎం చంద్రబాబుపైనే ఉన్నాయి. ఎలాగైనా దీన్ని పూర్తి చేస్తే తమకు ఇబ్బందులు తొలుగుతాయని వీరంతా చెబుతున్నారు. వాస్తవానికి యు.కొత్తపల్లితోపాటు తొండంగి మండలంలోని వేలాది మత్స్యకారులకు ఫిషింగ్ హార్బర్ లేదు. ఇతర హార్బర్‌లకు వేటకు వెళ్తే అక్కడ మత్స్యకారులు గొడవ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరందరి బాధలు గుర్తించి అప్పట్లో సీఎం చంద్రబాబు 2018లో కొత్త హార్బర్ నిర్మాణానికి వీలుగా ఆలోచించారు. ఒకేసారి 2,500 బోట్లకు బెర్తింగ్ సామర్థ్యం ఉండేలా కొత్త హార్బర్ ప్రతిపాదించారు. తీరా టెండర్లు పిలిచే సమయంలో ప్రభుత్వం మారి వైసీపీ పగ్గాలు చేపట్టింది. అప్పటినుంచి ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం నిలువునా మోసం చేస్తూనే ఉంది. చివరకు హార్బర్‌ను పూర్తి చేయకుండానే ప్రభుత్వం దిగిపోయింది. ఈ నేపథ్యంలో తిరిగి దీన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపైనే పడింది. ఒకరకంగా చెప్పాలంటే హార్బర్‌కు పురుడు పోసిన టీడీపీ ప్రభుత్వమే దీన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కూడా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం హార్బర్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను తప్పించి కొత్త కాంట్రాక్టర్‌కు పని అప్పగిస్తేనే పనుల్లో పారదర్శకత రానుంది. ఈ నేపథ్యంలో అందరి ఆశలు కూటమి ప్రభుత్వంపైనే ఉన్నాయి. మరోపక్క పవన్‌కల్యాణ్ ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నెగ్గడంతోపాటు డిప్యూటీ సీఎంగా ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ వహించి హార్బర్‌ను వేగంగా పూర్తి చేసేలా చొరవ చూపాలని మత్స్యకారులు కోరుతున్నారు.


బిల్లులు చెల్లించక ఎక్కడి పనులు అక్కడే ఆపేసిన కాంట్రాక్టర్


కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 18: నూతనంగా ఎన్నికైన ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. కలెక్టర్ వారితో తాళ్లరేవు మండలం అభివృద్ధిపై చర్చించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో.. మౌలిక సదుపాయాల కల్పన: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 18: విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై జిల్లా విద్యాశాఖ, ఎస్ఎస్ఏ అధికారులతో కలిసి మండలస్థాయి విద్యాశాఖ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 13 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. పాఠశాల తరగతి గదులు, పాఠశాల ఆవరణ, చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాలలో ఉన్న మంచినీరు ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. మరుగుదొడ్లను శుభ్రం చేసి నీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేకంగా తొండంగి మండలంలో డయేరియా కేసులు నమోదైన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రత, తాగునీరుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ అంశాలపై అన్ని మండల విద్యాధికారులు పరిధిలో ఉన్న పాఠశాలలను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేసి ఫొటోలను పంపించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్‌పై పాఠశాల ప్రిన్సిపాల్ పత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రధానంగా ప్రైమరీ ఉన్నత పాఠశాలలో ఎన్రోల్మెంట్ పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీయూపీ పాఠశాల పరిధిలో ఉన్న అన్ని అంగన్‌వాడీ సెంటర్లను నాలుగు రోజులపాటు ప్రిన్సిపాల్ సందర్శించి చిన్నారుల వివరాలను సేకరించాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు. నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి రమేష్, ఎస్ఎస్ఏలు, డీవైఈవోలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీల రద్దు

- ఐదేళ్లలో నిస్తేజంగా పరపతి సంఘాలు
- పాలకవర్గాల రాజీనామాలకు ప్రభుత్వ ఆదేశాలు
- జిల్లాలో ఇప్పటికే 58మంది రాజీనామా
- పర్సన్ ఇన్‌చార్జుల నియామకానికి టీడీపీ యోచన

పెద్దాపురం, జూన్ 18: జిల్లాలో సహకార సంఘాలు, సొసైటీల నామినేటెడ్ పాలకవర్గాలన్నీ ఇంటి ముఖం పట్టనున్నాయి. వీరంతా తక్షణమే రాజీనామాలు చేసి పాలకవర్గ పదవులనుంచి వైదొలగాలంటూ సహకారశాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. కోఆపరేటివ్ రంగంలో జిల్లాలో డీసీసీబీ, డీసీఎంఎస్‌తోపాటు 72 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) ఉన్నాయి. వీటి నియామకాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరగాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎన్నికలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేసింది. దీంతో పీఏసీఎస్‌లు నిస్తేజంగా మారాయి. నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది పీఏసీఎస్ చైర్మన్‌తో అటు ఇద్దరు సభ్యులతో త్రిసభ్య కమిటీని నామినేట్ చేసి వారి పదవీకాలాన్ని ప్రతి ఆరు నెలలకు పొడిగించుకుంటూ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకవర్గ సభ్యులతో రాజీనామాలు చేయించాలని సహకారశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. పదవులనుంచి తప్పుకోవాలని ఆ శాఖ అధికారులు చెప్పడంతో ఇప్పటికే కాకినాడ జిల్లాలో 58 పీఏసీఎస్‌నుంచి పాలకవర్గాలు రాజీనామాలు సమర్పించాయి. మిగిలినవారు తొలగేలా చర్యలు తీసుకుంటున్నారు. తొలగింపు అనంతరం అన్ని పీఏసీఎస్‌లకు సహకారశాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా తాత్కాలికంగా నియమించనున్నట్లు జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ తెలిపారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన పాలకవర్గాలు నియామకం ఉంటుందని తెలిపారు.



పోస్టింగ్‌ల కోసం ఎదురుచూపులు



- పొరుగు జిల్లాలకు వెళ్లిన ఎంపీడీవోలు
- రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు రాక

సామర్లకోట, జూన్ 18: ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలు తిరిగి సొంత స్థలాలకు వచ్చేందుకు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62 మండలాల ఎంపీడీవోలను పశ్చిమ గోదావరి, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు ఎన్నికల సంఘం బదిలీలు చేసింది. అప్పటి ఎంపీడీవోలు స్థానికంగా ఎన్నికలు నిర్వహించరాదన్న నిబంధనకు అనుగుణంగా ఇతర జిల్లాలకు బదలీ అయ్యారు. వారి స్థానాల్లో అనకాపల్లి, విశాఖ, కృష్ణా జిల్లాలకు చెందిన ఎంపీడీవోలను ఎన్నికల సంఘం నియమించింది. దీంతో మూడు నెలలుగా బయట జిల్లాల ఎంపీడీవోలే కొనసాగుతున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగియడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో స్వస్థలాలకు వచ్చేందుకు వారంతా వేచిచూస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీవోలను యథాస్థానాలకు పంపుతూ జీవో జారీ చేయాల్సి ఉంది. దీనికోసం వారంతా ఎదురుచూస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో బదిలీల ఉత్తర్వుల జీవో జారీఅయ్యే అవకాశాలు ఉండడంతో పాత ఎంపీడీవోలందరూ పూర్వపు స్థానాలకు రానున్నారు.

ముమ్మరంగా పైరవీలు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కూలిపోవడం, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎంపీడీవోలు అనుకూలమైన మండలాలకు వచ్చేందుకు ముమ్మరంగా ఈ పైరవీలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే, మండల స్థాయి నాయకులను కలిసి ప్రాధాన్యం కలిగిన మండలాల్లో తమకు పోస్టింగ్ ఇవ్వాలని ఇందుకు సిఫారసు లేఖను ఎమ్మెల్యే నుంచి ఇప్పించాలని కోరుతున్నారు. ఏ మండలానికి ఎవరెవరిని వేసుకోవాలన్నా కసరత్తును కొంతవరకూ ఎమ్మెల్యేలు, నేతలు చేసినట్లు సమాచారం ఉంది. జిల్లా నుంచి బదిలీ అయిన ఎంపీడీవోలు తొలిగా యథాస్థానాల్లో బాధ్యత చేపట్టిన తర్వాత బదిలీలను ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉంది. అప్పుడు ఎంపీడీవోలు కోరుకున్న స్థానాలకు మారే అవకాశాలు ఉంటాయి. కాగా సామర్లకోట మండలంలో పనిచేస్తున్న ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎంపీడీవోల బదిలీలకు బేరసారాలు సాగిస్తున్నట్లు సమాచారం ఉంది. ఇప్పటికే కొందరి ఎంపీడీవోలను టీడీపీ నాయకుల వద్దకు తీసుకెళ్లి పైరవీలు చేసినట్లు తెలిసింది. సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ తనకుగల పలుకుబడి దృష్ట్యా రోజువారీ విధులకు సక్రమంగా హాజరుకాకపోయినా, పనులకు సంబంధించి ఎంబుక్‌లు రికార్డులు చేయకపోయినా అతడిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సైతం వెనుకంజ వేస్తుండడం గమనార్హం.

స్తంభించిన పాలన

ఎంపీడీవోల బదిలీలతో పాలన పూర్తిగా ఆగిపోయింది. తాత్కాలికంగా ఇచ్చిన ఎంపీడీవోలు పాలనకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోలేమని తేల్చిపారేస్తున్నారు. దీంతో ఎంపీడీవో కార్యాలయాల్లో మూడునెలలుగా పరిపాలన పూర్తిగా స్తంభించింది. గత ఎంపీడీవోలు తిరిగి వచ్చాక పాలన ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

రేషన్ బియ్యం పక్కదారి

- మాఫియా తరహాలో బియ్యం వ్యాపారం
- రేషన్ వాహనాల్లోనే కొనుగోలు ప్రక్రియ
- బియ్యం ఇచ్చేది వారే.. కొనుగోలు చేసేది వారే

తుని రూరల్, జూన్ 18: జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. విజిలెన్స్ దాడుల్లో పట్టుబడుతున్న రేషన్‌బియ్యం అక్రమాల కట్టడి అంతంత మాత్రంగానే ఉంది. మాఫియా తరహాలో రేషన్ బియ్యం దందా కొనసాగుతోంది. దీని వెనుక వైసీపీకి చెందిన బడాబాబులు ఉండడంతో అధికార యంత్రాంగం ఇంతవరకు పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. రేషన్‌బియ్యం కొనుగోలు, విక్రయాలు అన్ని రేషన్‌పంపిణీ చేసే వాహనాల ద్వారా జరగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. జిల్లాలో 21 మండలాల్లో 6,53,750మంది కార్డుదారులకు రేషన్ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్‌బియ్యం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల వ్యయంతో అందించే ఈ బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు వీటిని తక్కువ ధరలకు కొనుగోలు చేసి సన్నబియ్యంగా మార్చి అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనల ప్రకారం నేరమని తెలిసినా ఈ దందా ఆగడం లేదు. దీన్నే వృత్తిగా కొనసాగించడం గమనార్హం. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. మామూళ్లు తీసుకుని చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టరేట్(కాకినాడ), జూన్ 18: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు అత్యంత సమర్థతతో నిర్వహించినందున కలెక్టర్ జె.నివాస్‌ను ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు, చైర్మన్ కాకినాడ జిల్లా శాఖ అభినందించింది. కార్యక్రమంలో పితాని త్రినాథ్, శివ, రఘు, రామ్మోహన్, దుర్గాప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 57శాతం ఉత్తీర్ణత

కాకినాడ రూరల్, జూన్ 18: గత నెలలో 24 నుంచి 30 వరకూ నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో ఈ పరీక్షలకు జనరల్ కేటగిరీలో 5,901మంది విద్యార్థులు హాజరుకాగా 3,347మంది ఉత్తీర్ణులయ్యారని, 2,554మంది పాస్‌కాలేదని డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. ఒకేషనల్ పరీక్షలకు 384మంది హాజరుకాగా 218మంది ఉత్తీర్ణులుకాగా 166మంది పాస్‌కాలేదన్నారు. జిల్లాలో 56.7శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

నిబంధనల అతిక్రమణ

- పాఠశాలల్లో పుస్తకాలు విక్రయం
- కొనాల్సిందేనంటున్న యాజమాన్యాలు
- నిబంధనలకు విరుద్ధంగా స్టాల్స్ ఏర్పాటు
- అధిక ఫీజులు, వసతులు కరువు
- తల్లిదండ్రులపై ఒత్తిడి

తుని రూరల్, జూన్ 18: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తున్నాయి. స్కూల్‌లోనే పుస్తకాలు కొనాలని పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో స్కూల్స్‌లోనే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.బుక్స్ మాత్రమే కాదు యూనిఫాం, టై, బెల్ట్‌లు తమ వద్ద కొనాలంటున్నారు. దీంతో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, టై, బెల్ట్ అమ్మకాలపై పాఠశాలలు దుకాణాలను మరిపిస్తున్నాయి.

ప్రైవేట్ బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యను అందించాల్సిన యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా విద్యతో వ్యాపారం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నర్సరీ నుంచి పదో తరగతి వరకు స్టడీ మెటీరియల్, అదీ, ఇదీ అంటూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు బేఖాతరు చేస్తున్న సంబంధిత అధికారులు పాఠశాలల వైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రైవేట్ పాఠశాలల్లో నిర్దేశించిన ఫీజులు కంటే ఎక్కువ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు వసతుల కల్పనలో నిర్లక్ష్యంగా వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిపాఠశాలల్లో ఇరుకు గదుల్లో 30నుంచి 50మంది విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తుంటే పాఠ్యాంశాలు అర్థమయ్యేది ఎలా అని తల్లిదండ్రులు వాపోతున్నారు. కొన్నిపాఠశాలల్లో వేలాదిమంది విద్యార్థులు ఉంటే బాత్‌రూంలు పదుల సంఖ్యలో ఉండడంతో క్యూలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

షాపులుగా మారిన పాఠశాలలు

పాఠశాలలు ప్రారంభమైననాటినుంచి ప్రైవేట్ పాఠశాలలు షాపులుగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టుమని పదిరోజులు కాకుండా బుక్స్, యూనిఫాం, టైం వంటివి కొనాలని ఉపాధ్యాయుల ఒత్తిడితో తల్లిదండ్రులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రారంభంలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలతో పాఠ్యాంశాలు బోధించాలని ఉపాధ్యాయులు టై, బె ల్ట్, షూ, స్టడీ మెటీరియల్స్ తప్పనిసరన డంతో ఆర్థికభారంతో సతమతమవుతున్నారు.

కొరవడిన నియంత్రణ

కూలీనాలీ పనులు చేసుకుని పిల్లలను చదివాలంటేనే తల్లిదండ్రులు పిల్లలను చదవించలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధికంగా ఫీజులు చెల్లించడంతో నిరుపేద, మధ్య తరగతి వారికి పెనుభారంగా మారింది. అధిక ఫీజులు నియంత్రించాల్సిన అధికారులు సైతం తమకు ఏ సంబంధం లేదన్నట్లు పాఠశాలలపై కన్నెత్తి చూడడంలో లేదని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల మోత మోగిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులపై దృష్టిసారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

● అవసరం లేని పుస్తకాలు కొనిపిస్తున్నారు

-పి.అనంతలక్ష్మి, విద్యార్థి తల్లి

విద్యార్థులకు అవసరమైన బుక్స్, నోట్‌బుక్స్ విక్రయించడంతో అధికంగా భారం పడుతోంది. విద్యార్థులతో పాఠ్యపుస్తకాలు, స్టడీమెటీరియల్స్ అంటూ కొనిపిస్తున్నారు. ఓవైపు అధిక ఫీజులు వసూళ్లతోపాటు టై, బెల్ట్, బ్యాడ్జీ, ఐడీ కార్డులతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. అధిక ఫీజులు వసూలు చేసే స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి.

● ఉపాధి కోల్పోతున్నాం

-ఆర్.రాజేంద్రప్రసాద్, బుక్‌స్టాల్ యాజమాని

ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్, నోట్‌బుక్స్ అమ్మకాలతో బుక్‌స్టాల్స్‌లో విక్రయాలు తగ్గాయి. పాఠశాల్లోనే విక్రయించంతో పుస్తకాలు అమ్ముడుపోగా మేము పెట్టిన పెట్టుబడులు, షాపుల అద్దెలు సైతం రాక ఇబ్బందులకు గురవుతున్నాం. సంబంధిత అధికారులు మా జీవనోపాధి కోల్పోకుండా చర్యలు చేపట్టాలి.

కొమ్మనాపల్లిలో తగ్గాయి..బెండపూడిలో పెరిగాయి

- మరో గ్రామంలో డయేరియా కేసులు
- వైద్య సిబ్బంది అప్రమత్తం


సిబ్బందితో మాట్లాడుతున్న గాయత్రీదేవి

తొండంగి, జూన్ 18: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో గత వారం రోజులుగా నమోదవుతున్న డయేరియా కేసుల ఉధృతి తగ్గి కనిష్ఠ స్థాయికి చేరుకోగా ఈ దశలో కొత్తగా బెండపూడిలో 18 డయేరియా కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కొమ్మనాపల్లిలో సుమారు వంద కేసులు వరకూ నమోదు కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం అంతా మకాం వేసి వారం రోజులుగా స్థానికంగాను, కాకినాడ జీజీహెచ్‌లోను రోగులకు చికిత్స అందించడంతో మంగళవారానికి తీవ్రత మూడు కేసులకు తగ్గింది. కాకినాడ నుంచి సుమారు 25 మంది జీజీహెచ్ నుంచి, మరో 15 మంది ప్రైవేటు ఆసుపత్రుల నుంచి రిలీవ్ అయ్యారు. అధికార యంత్రాంగం, ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో బెండపూడి గ్రామంలో భారీగా డయేరియా కేసులు నమోదు కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. బెండపూడి సబ్ సెంటర్‌లో 10 మందికి చికిత్స అందించి మరో 8 మందిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సబ్‌సెంటర్‌లో బెడ్ అందుబాటులో లేకపోవడంతో కుర్చీలలోనే పడుకోబెట్టి సెలైన్ పెడుతున్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సరిత గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ టి.గాయత్రిదేవి రోగుల్ని పరామర్శించి వైద్యులతో సమావేశమయ్యారు. వ్యాధి వ్యాప్తికి గల కారణాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కొమ్మనాపల్లి వైద్య శిబిరంలో డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతి రోగులకు చికిత్స అందించారు. బెండపూడి గ్రామంలో నూతి నీటిని తాగునీటిగా ఉపయోగించడం వలనే డయేరియా వ్యాప్తి చెంది ఉంటుందని భావించి ఆ నీటిని ఉపయోగించవద్దని నోటీసు అంటించి చుట్టూ కంపతో మూసివేశారు.

తాగునీటి వనరుల పరిశుభ్రతకు ప్రత్యేక డ్రైవ్

డయేరియా వంటి సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాగునీటి వనరులు పరిశుభ్రతకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ గాయత్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె డయేరియా ప్రభావిత గ్రామాలైన కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో ఆ శాఖ అధికార బృందంతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాగునీటి వనరుల శుభ్రతకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని తమ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. దీనిలో భాగంగా గతంలో ఓవర్‌హెడ్ ట్యాంకులను శభ్రపరిచిన తేదీతో సంబంధం లేకుండా అన్ని ట్యాంకులను శుభ్రపర్చడం, ప్రజలకు వెళ్లే ప్రతి నీటి చుక్కను క్లోరినేషన్ చేసి అందించడం ,పైప్‌లైన్ లీకులు, ఇతరత్రా ఎటువంటి లీకులు లేకుండా చూడడం కార్యక్రమ ఉద్దేశమన్నారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు. తాగునీరు,ఆహార కాలుష్యం కారణంగా డయేరియా వ్యాధి ప్రబలుతుందని. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జగ్రత్తలు పాటించాలన్నారు. కొమ్మనాపల్లి గ్రామంలో కొన్ని ప్రాంతాల్లోని నీటి శాంపిళ్లు తాగడానికి అనువైనది గాను మరికొన్ని ప్రాంతాల్లో అనువైనది కాదని రిపోర్టు వచ్చినందున ఆయా ప్రాంతాల్లో రక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు దళిత వాడలో కొత్తబోరు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాధి బాధితులు ఉన్న వీధిలో పర్యటించి వ్యాధి వ్యాప్తికి గల కారణాలను పరిశీలించారు. అనంతరం ఆమె బెండపూడిలో అధికారలతో సమావేశమయ్యారు. ఆమె వెంట ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ భారతి, డీఈ కోసాన రాంబాబు, జేఈ ఎ.శివాజీ ,రమ్య అనూష, బెండపూడి టీడీపీ, జనసేన నేతలు సాధనాల నూకరాజు, బెండపూడి నాయుడు తదితరులు ఆమె వెంట ఉన్నారు.


బావిని పరిశీలిస్తున్న అధికారులు

1200 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత


పోలీస్‌స్టేషన్‌లో బియ్యం మూటలు

తుని రూరల్, జూన్ 18: కాకినాడ జిల్లా తుని రూరల్ మండలం దొండవాక గ్రామంలో ఎండీయూ ఆపరేటర్ ఇంటి నుంచి సుమారు 1200 కిలోల పీడీఎస్ బియ్యం గుట్టు చప్పుడు కాకుండా తరలించేయడంతో గమనించిన గ్రామస్తులు పీడీఎస్ బియ్యంతో ఉన్న ఆటోను అడ్డగించారు. అనంతరం సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వగా రూరల్ పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆటోను సంబంధిత డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై పోలీసులను వివరణ కోరగా పీడీఎస్ బియ్యం పట్టుబడటం విధితమేనని దీనిపై కేసు నమోదు చేసి ఎవరు విక్రయించారు, ఎక్కడకు వెళుతున్నాయనే దానిపై వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

ద్రాక్షారామ, జూన్ 18: రామచంద్రపురం మండలం ఓదూరు రైల్వే క్రాసింగ్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేళంగి గ్రామానికి చెందిన యరమాటి కృష్ణచైతన్య చౌదరి (16) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేళంగి గ్రామానికి చెందిన కృష్ణ చైతన్య చౌదరి తన సోదరుడు షాపు ముందు పార్కు చేసిన హీరో హోండా మోటారు సైకిల్‌ను ఎవరికీ చెప్పకుండా తీసుకుని సోమవారం రాత్రి 6.50 గంటల సమయంలో వేళంగి నుంచి రామచంద్రపురం వైపు బయలుదేరాడు. ఓదూరు రైల్వే క్రాసింగ్ వద్దకు వచ్చే సరికి స్పీడ్ బ్రేకరు వద్ద మోటారు సైకిల్ అదుపు తప్పి పడిపోగా స్పృహ కోల్పోయాడు. తెలిసిన వ్యక్తులు కృష్ణ చైతన్యచౌదరి పెదనాన్నకు సమాచారం అందించారు. దీంతో కృష్ణచైతన్య పెదనాన్న వేళంగి ఆర్ఎంపీ వైద్యుని వద్దకు తీసుకువెళ్లి అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రామచంద్రపురం ఎస్ఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డుగోడ కూలింది..

- ఆంజనేయనగర్ వాసుల కళ్లల్లో ఆనందం
- గత వైసీపీ పాలనలో దారికి అడ్డంగా గోడ
- ఎమ్మెల్యే నల్లమిల్లి సమక్షంలో తొలగించిన వైనం


గోడ కూల్చుతున్న ఎక్సకవేటర్


ఎమ్మెల్యే నల్లమిల్లి దగ్గర ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అనపర్తి, జూన్ 18: అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో అధికారులు అనపర్తిలోని ఆంజనేయ నగర్ వాసుల రాకపోకలకు అడ్డుగా ఉన్న ప్రహరీని మంగళవారం తొలగించారు. దీంతో కాలనీ వాసులు ఎమ్మెల్యే నల్లమిల్లికి కృతజ్ఞతలు తెలిపారు. అనపర్తిలోని ఆంజనేయనగర్ వాసులు 40 సంవత్సరాలుగా ఉపయోగిస్తున్న రోడ్డును హైస్కూల్ ప్రహరీ నిర్మాణం పేరుతో వైసీపీ నాయకులు దారిని మూసివేశారు. గోడ నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు కలిగించారు. ఈ నేపథ్యంలో అదే కాలనీకి చెందినకర్రి అరుణకుమారి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. కాలనీ వాసులు ఉపయోగిస్తున్న రోడ్డుకు ఇబ్బంది లేకుండా సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడతామని అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హామీ ఇచ్చి చివరకు పోలీసుల సహాయంతో ఎవ్వరినీ దరి చేరనీకుండా రోడ్డు మూసివేస్తూ గోడ నిర్మించారని దీనితో తాను గుడికి వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని కాలనీకి చెందిన అరుణకుమారి ఆత్మహత్యకు పాల్పడింది. అంతే కాకుండా తన ఆత్మహత్యకు ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి కారణమంటూ ఆమె సూసైడ్ నోట్ రాయడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. దీంతో ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబానికి, కాలనీ వాసులకు అండగా నిలవడమే కాకుండా తాము అధికారం చేపట్టగానే ప్రహరీ అడ్డంకి తొలగించి కాలనీ వాసులకు రహదారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి ముఖ్యంగా ఆంజనేయరెడ్డి నగర్ వాసుల ఇబ్బందులు, పరిసరాల్లో ఆక్రమణలపైనా చర్చించారు. అనంతరం ఆంజనేయరెడ్డి నగర్‌కు అధికారులతో చేరుకున్న ఎమ్మెల్యే కాలనీ వాసులకు రహదారి కల్పించాలని నిర్ణయించారు. దీంతో అధికారులు జేసీబీతో కాలనీలోని రోడ్లకు అడ్డుగా ఉన్న ప్రహరీని ప్రధాన రహదారికి అనుసంధానం చేసే చోట ఉన్న ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న కాలనీ వాసులు ఎమ్మెల్యే నల్లమిల్లికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఆత్మహత్యకు పాల్పడిన అరుణకుమారి భర్త సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులకు రహదారి ఏర్పడటంతో తన భార్య ఆత్మ శాంతించిందని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, బాసి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి




రాజు(ఫైల్‌ఫొటో)

కడియం, జూన్ 18: జాతీయ రహదారిపై కడియం మండలం పొట్టిలంక వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొట్టిలంక వీవర్స్ కాలనీకి చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పొట్టిలంక వీవర్స్ కాలనీకి చెందిన బీరక రాజు(44) మోటారుసైకిల్‌పై సెంటర్‌కు వెళుతూ హైవే రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో రావులపాలెం నుంచి వేమగిరి వైపు వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో రాజు తలకు తీవ్రగాయం అయింది. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బీరక రాజు భార్య లక్ష్మీవెంకట సంధ్య ఫిర్యాదు మేరకు కడియం ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం


భవాని(ఫైల్)

రాజానగరం, జూన్ 18 : తోటికోడలు ఆకస్మిక మృతితో మానసిక ఆందోళనకు గురైన వివాహిత సోమవారం తెల్లవారు జామున ఇంటి నుంచి అదృశ్యమైంది. రాజానగరం మండలం తూర్పుగోనగూడెం గ్రామంలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గల్లా భవాని అనే మహిళ ఈ నెల 17న తెల్లవారుజామున ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. బయటకు వెళ్లే సమయంలో మెడలో ఉన్న పుస్తెలతాడు, చెవి దిద్దులు తీసి ఇంట్లోనే వదిలివెళ్లింది. భవాని తోటి కోడలు అనారోగ్యంతో ఈ నెల 14న ఆకస్మాత్తుగా మృతిచెందింది. అప్పటి నుంచి మానసిక ఆందోళనతో గడుపుతున్న భవానీ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో వెళ్లిపోయింది. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నీలం రంగు చీర, జాకెట్టు ధరించి ఉన్నట్లు ఆమె కుమార్తె దేవి చెప్తోంది. బంధువుల ఇంటి వద్ద పరిసర ప్రాంతాల్లో గాలించిన ఆచూకీ లభించలేదు. భవాని అల్లుడు భూషంశెట్టి వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాజానగరం పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని సీఐ పి.కాశీవిశ్వనాథ్ కోరారు.

ఘనంగా పండిత సదస్యం


పండిత సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

మామిడికుదురు, జూన్ 18: అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాల్లో భాగంగా పండిత సదస్యం కార్యక్రమాన్ని మంగళవారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి మంగళవారం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, సహస్ర నామార్చన, బాలభోగ నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థప్రసాద గోష్ఠి, చతుష్టానార్చనలు, వేద పారాయణం, మంగళాశాసనములు తదితర కార్యక్రమాలతో వేద సదస్యం(పండిత సన్మానాన్ని) ఘనంగా జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మామిడికుదురుకు చెందిన యింటి శ్రీరామ్‌కుమార్, సుజాత ఆలపించిన అన్నమాచార్య సంకీర్తన విభావరి, అప్పనపల్లికి చెందిన శేష శారద భక్త బృందం వారు ఆలపించిన పురందరదాసు కీర్తనలు, మానేపల్లికి చెందిన ప్రకాశ్ గురుస్వామి భజనా కార్యక్రమం భక్తులను రంజింపచేశాయి. ఈ కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజీ మార్గంతో సమయం ఆదా



మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ మార్గంతో సమయం ఆదా అవుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. న్యాయవాదులకు నిర్వహించే మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన ప్రయోజనం సమకూరుతుందన్నారు. ఖర్చు లేకుండా సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఐదు రోజుల్లో 40 గంటల పాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన న్యాయవాదులకు బెంగళూరుకు చెందిన ప్రొటెన్షియల్ ట్రైనర్స్ గీతాదేవి, బి.శ్రీకుమార్, చెన్నైకి చెందిన సీనియర్ ట్రైనర్ ఆర్.విజయ కమల మధ్యవర్తిత్వ నైపుణ్య శిక్షణ అందిస్తారన్నారు. ఈ నెల 26వ తేదీ వరకూ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.గాయత్రి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గోగన్న మఠంలో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న సిబ్బంది

మామిడికుదురు, జూన్ 18: గోగన్నమఠం గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కురుడీ కొబ్బరి రాశులు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన అల్లు సురేష్ బాబు కొబ్బరికొట్టులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కురుడీ కొబ్బరికాయల రాశులు అంటుకున్నాయి. రాజోలు అగ్నిమాపక దళం వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. సుమారు రూ.2 లక్షల కురుడీ కొబ్బరి కాయలు ప్రమాదంలో దగ్ధమయ్యాయని బాధితుడు పేర్కొన్నాడు.


కాలిపోయిన కొబ్బరికాయలు

మొక్కల పెంపకంలో ఖైదీలకు శిక్షణ


స్వాతికి మొక్క అందిస్తున్న సూపరింటెండెంట్ రాహుల్

రాజమహేంద్రవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఖైదీలకు మొక్కల పెంపకంలో ఈ నెల 18 నుంచి 30 వరకూ శిక్షణ ఇస్తున్నామని సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. వివిధ రకాల పండ్లు, పూలు, క్రోటాన్స్ మొక్కల పెంపకంలోని మెలకువలను నేర్పిస్తున్నామన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ కె.స్వాతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కలను అభివృద్ధి చేయడం తద్వారా ఉపాధి పొందడాన్ని వివరించారు. మొక్కల పెంపకంలో కృషి ఎంత ఉంటే అంతగా సంపాదన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, మునిసిపల్ ఉద్యానవన ఉద్యోగి బాలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కొత్తపల్లి, జూన్ 18: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాద్ బీచ్‌రోడ్డు సమీపంలో మంగళవారం ఓ మత్స్యకారుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొండంగి మండలానికి చెందిన మైలపల్లి ఎల్లయ్య(53) ప్రతీరోజూ వేట చేసేందుకు అమీనాబాద్ రేవుకు వచ్చి వెళుతుంటాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పెట్రోలు బంక్ సమీపంలో ఎల్లయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మండపేటలో యువకుడి ఆత్మహత్య


నాగదుర్గాకుమార్

మండపేట, జూన్ 18: మండపేటలో ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని గొల్లపుంతకు చెందిన సోము నాగదుర్గాకుమార్ (19) పబ్జిఫైర్ ఫ్రీగేమ్ సెల్‌ఫోన్‌లో ఆడుతుంటాడు. ప్రసాద్ తాపీ పని చేస్తుంటాడు. అయితే ఏమైందో తెలియదు కానీ మంగళవారం పనికి వెళ్లి ఇంటికి వచ్చి రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రసాద్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు జరిగిన సంఘటనపై ఆరా తీస్తున్నామని పట్టణ సీఐ అఖిల్‌జమా, ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. యువకుడి ఆత్మహత్యపై కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

భర్త దాడిలో భార్య మృతి


మృతిచెందిన మహిళ

కాట్రేనికోన, జూన్ 18: అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పోర గ్రామానికి చెందిన అర్థాని కస్తూరి(36) భర్త కొట్టడంతో మృతి చెందింది. తన భర్త సతీష్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో మంగళవారం కస్తూరి సతీష్‌ను నిలదీసింది. ఆగ్రహించిన సతీష్ సాయంత్రం భార్యను కొట్టాడు. ఈ దెబ్బలకు కస్తూరి మృతి చెందింది. కస్తూరి తల్లి బలుసుతిప్పకు చెందిన సంగాని కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

రత్నగిరి ప్రకాష్ సదన్‌లో నల్లుల బెడద

- ఏసీ గదుల్లో సైతం నల్లుల బాధే
- బస చేయడానికి వచ్చిన భక్తులు అసహనం
- అయినా పట్టించుకోని పారిశుధ్య విభాగం



అన్నవరం, జూన్ 18: సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు బస చేయాలంటే ముందుగా గుర్తొచ్చేది ప్రకాష్‌సదన్ కాటేజీ.. ఎందుకంటే బస చేసే భక్తులకు ఆహారం, ఇతర అవసరాలకు దగ్గర్లో దుకాణ సముదాయాలు ఉండడం, ఆలయానికి దగ్గరగా ఏసీ గదులతో ఉన్న కాటేజీ కావడంతో ఎవరైనా ముందుగా ప్రాధాన్యమిచ్చేది ఈ కాటేజీకి మాత్రమే. ప్రముఖుల సిఫార్సు లేఖలకు, పాలకమండలి సభ్యులు విచ్చేసినా ఈ కాటేజీలోనే బస ఏర్పాటు చేస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కాటేజీలో ప్రస్తుతం బస చేయాలంటే నరకం అనుభవించాల్సి వస్తుందని భక్తులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి ప్రధాన కారణం నల్లులు ఆవాసంగా ఉండడమే. అయితే ఈ నల్లులు గతంలో ప్రతి ఇంట్లో ఉండేవి కానీ ఇప్పుడు ఎక్కడా వీటి జాడ కనపడకపోయినా ప్రకాష్‌సదన్ కాటేజీలో మాత్రం విరివిగా ఉన్నాయి. 84 గదులున్న ఈ కాటేజీలో గది తీసుకోవాలంటే ప్రస్తుతం భయపడుతున్నారు. రోజుకు సుమారు 80 వేలరూపాయలు అద్దె వచ్చే కాటేజీ అయినా నల్లుల నిర్మూలనకు శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడం విచారకరం. నాలుగు అంతస్తులలో ఉన్న ఈ కాటేజీలో వారానికి ఒక్కొక్క ఫ్లోర్ భక్తులకు అద్దెకివ్వకుండా నివారణ చర్యలు చేపట్టే మార్గం ఉన్నా ఆ దిశగా శానిటరీ వర్కర్లు ప్రయత్నించే దాఖలాలు కనబడడం లేదు. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి భక్తులను నరకయాతన నుంచి బయటపడేలా చేయాలని కోరుతున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా నల్లులు ఉన్నమాట వాస్తవమేనని గతంలో కెమికల్స్ వేసి చర్యలు చేపట్టినా నిర్మూలన కాలేదని ఈ కాటేజీలో వారం రోజులు పాటు పూర్తిగా గదులు అద్దెకివ్వకుండా ఉంటే ప్రత్యేక చర్యల ద్వారా శాశ్వతంగా నిర్మూలించవచ్చునని అన్నారు.

కాకినాడ

బోట్‌క్లబ్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం : కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 18: బోట్‌క్లబ్ పార్కుకు వచ్చే సందర్శకులు, వాకర్స్ సౌకర్యార్థం మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. బోట్‌క్లబ్ ఉద్యానవనాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వాకర్స్ సమస్యలు తెలియజేశారు. వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్నప్రసాదరావు కమిషనర్‌కు స్వాగతం పలికారు. ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏఈ రమేష్, వాకర్స్ ప్రతినిధులు దాసరి శ్రీధర్, రాఘవరావు, శ్రీరామరాజు ఉన్నారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం : ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట, జూన్ 18: పేదప్రజల ఆకలి తీర్చడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం సామర్లకోటలో విలేకరులతో రాజప్ప మాట్లాడుతూ సామర్లకోట, పెద్దాపురం పట్టణాలలో 2 అన్న క్యాంటీన్లను త్వరలోనే పునఃప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న మొదటిరోజు 5 హామీల్లో ఒకటైన అన్న క్యాంటీన్ల ప్రారంభంపై సంతకం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్న కాంటీన్లను ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించగా వీటి ద్వారా రాష్ట్రంలోని వేలాది మంది పేదలు రూ.5కే కడుపు నిండా భోజనం చేసేవారన్నారు. అయితే ఆ తర్వాత ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సైకో జగన్ పేదల కడుపు కొట్టి అన్యాయంగా వాటిని తొలగించారని ధ్వజమెత్తారు. అయితే సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబును ప్రజలు మరోసారి ముఖ్యమంత్రిని చేశారన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అన్న క్యాంటీన్లు పునఃప్రారంభమవుతాయన్నారు. స్వల్ప రుసుముతో రుచి,శుచి, నాణ్యతతో కూడిన భోజనం,అల్పాహారం అందించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి'

కాకినాడరూరల్, జూన్ 18: జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సత్వరచర్యలు చేపట్టాలని ఎస్టీయూ కాకినాడ జిల్లాశాఖ అధ్యక్ష కార్యదర్శులు మోర్త శ్రీనివాస్, కుసుమంచి కాశీవిశ్వనాద్ ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో పిల్లి రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. డీఎస్సీ 2008, 1998 ఎంటీఎస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు ఉత్తర్వులివ్వాలని, ప్రాథమిక పాఠశాలల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను తాత్కాలికంగా పనిసర్దుబాటుపై నియమించాలని, మండలాల్లో ఉపాధ్యాయ సంఘం నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటుకు ఎంఈవోలకు ఆదేశాలివ్వాలని కోరారు. ఎస్టీయూ నాయకులు సుబ్బరాజు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కృష్ణంరాజు, శ్రీనివాసరావు, రామతేజ పాల్గొన్నారు.

'తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

కాకినాడ సిటీ, జూన్ 18: సామర్లకోట ఏడీబీ రోడ్‌లోని రాక్‌సిరామిక్‌లో అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ రాక్ సిరామిక్ యాజమాన్యం ఎన్నికల నోటిఫికేషన్ అడ్డుపెట్టుకుని 40మంది కార్మికులను గేటువద్ద ఆపేసిందన్నారు. కార్మికులను తొలగించి నేటికి 64 రోజులైందని, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఆదేశాలిచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్, ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జేసీకి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి క్రాంతికుమార్, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, సిరామిక్ కార్మికులు పాల్గొన్నారు.

'మాకు ఉద్యోగభద్రత కల్పించాలి'

పిఠాపురం, జూన్ 18: ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యం షాపుల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పించాలని షాపుల సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పాత పాలసీ రద్దయి నూతన మద్యం విధానం అమలులోకి వస్తుందని వార్తలు వస్తున్నాయని.. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపుల్లో పని చేస్తున్న 12వేల మంది, వారిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వినతులను పరిగణలోకి తీసుకుని ఉద్యోగభద్రత కల్పించేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. న్యాయం జరిగేలా కృషిచేస్తానని వర్మ హామీ ఇచ్చారు.

'సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు'

కరప, జూన్ 18: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.వర్ధన్, ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలం సీజన్ ఆరంభమవనున్న దృష్ట్యా గ్రామాలకు క్లోరినేషన్ చేయించిన సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని, తాగునీటి పైపులైన్లకు ఉన్న లీకేజీలను అరికట్టాలని సూచించారు. నడకుదురు శివాలయం వీధి, పెనుగుదురు ఎస్సీపేట, యండమూరు శివారు వడ్డిపాలెంలలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు సరైన మెట్లు లేవని కార్యదర్శులు చెప్పగా 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి తక్షణం మెట్ల నిర్మాణం చేపట్టాలని అధికారులు ఆదేశించారు.

'ట్యాంకుల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు'

కొత్తపల్లి, జూన్ 18: వర్షాకాలంలో ప్రజలకు ఏ అనారోగ్య సమస్యలు రాకుండా ముందుజాగ్రత్త చర్యగా గ్రామాల్లో పూర్తిస్థాయి పారిశుధ్యం, మంచినీటి ట్యాంకుల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కొత్తపల్లి ఎంపీడీవో పి.వెంకటనారాయణ సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మురుగుకాలువల్లో పేరుకున్న చెత్తాచెదాలను తొలగించాలని, మంచినీటి ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేయించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ మేడారపు సత్య భాస్కర్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈఈ సంధ్య, ఎలక్ట్రికల్ ఏఈఈ ప్రమోద్ కుమార్, కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, వారిజ, ముసలయ్య, సత్తిబాబు పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమమే లక్ష్యంగా సేవలందించాలి'

తుని రూరల్, జూన్ 18: తేటగుంట పీఏసీఎస్ భవనంలో సంబంధిత అధికారులతో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. గ్రామ మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా అధికారులు సేవలందించాలని అందుకనుగుణంగా ఎమ్మెల్యే యనమల దివ్య సహకారం శాఖకు అందించనున్నట్టు తెలిపారు. మాజీ మంత్రి యనమల సారథ్యంలో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారన్నారు. కొల్లు సత్యనారాయణ, గజ్జి రాంబాబు, చామంతి సత్తిబాబు, కోనా కన్నారావు, మర్రివీరబాబు, నిమ్మల లోవ సూరిబాబు, గెట్ల శివ ఉన్నారు.

'ఉపాధి కూలీలకు బకాయిలు తక్షణం చెల్లించాలి'

తాళ్లరేవు, జూన్ 18: ఉపాధి కూలీలకు వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు మంగళవారం డిమాండ్ చేశారు. కార్మికసంఘం నేతలు మండలంలోని పలుచోట్ల ఉపాధి పనుల కూలీల పరిస్థితులపై పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 2, 3 వారాలకు సంబంధించిన వేతన బకాయిలు ఉన్నాయని వాటిని కూలీలకు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, కూలీలకు రూ.300కూలీ చెల్లించాలని, వేతనాలు చెల్లించకుంటే ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతామన్నారు.

'వసతిగృహంలో పనులు పూర్తి చేయాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 18: కాకినాడ బాలాజీ చెరువు సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ వసతి గృహంలో డైనింగ్ హాలు నిర్మాణం పనులు, మరమ్మతులు పూర్తిచేయాలని దళిత సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను కోరారు. మంగళవారం దళిత సంఘాల ప్రతినిధులు అయితాబత్తుల రామేశ్వరరావు, పిల్లి రామారావు, నూకరాజు కలిసి కోరారు. దీనికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వసతి గృహం వేగంగా అందుబాటులో ఉండేలా కృషి చేయాలన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

కట్టమూరులో తాటికిల్లు దగ్ధం

పెద్దాపురం, జూన్ 18: మండలంలోని కట్టమూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం ఓ తాటి కిల్లు దగ్ధమైంది. ఏడీఎఫ్‌వో ఎం.శ్రీహరిజగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాకర్ల శివ సూర్య నారాయణ తన కుటుంబ సభ్యులతో స్థానిక రాజుగారి బీడులో నివసిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉన్న విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడగా భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.50వేలు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. గ్రామ టీడీపీ, జనసేన నేతలు మేడిది శ్రీనివాస్, అడపా గంగాధర్, మాదిరెడ్డి రామకృష్ణ, పెట్లు వీరభద్రరావు, చిక్కాల సాయి బాధితుల ఇంటికి వెళ్లి వారికి బియ్యం నిత్యావసర వస్తువులతో పాటు నగదు అందచేశారు.

ట్రై సైకిల్ అందజేత

జగ్గంపేట, జూన్ 18: రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సహాయ సంచాలకులు(జిల్లా ఏడీ)నరసింహామూర్తి ఏర్పాటు చేసిన చార్టిబుల్ సైకిల్‌ను గోకవరం మండలం కొత్తపల్లికి చెందిన మండల దివ్యాంగుల అధ్యక్షులు అడబాల సింగరయ్యకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందించారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు మండపాక అప్పన్నదొర, టీడీపీ కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడు దిండి రాజు పాల్గొన్నారు.

ఎంపీడీవో సమీక్షా సమావేశం

గండేపల్లి, జూన్ 18: మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో హనుమంతరావు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో భాగంగా డ్రైనేజీల్లో పూడికలు తొలగించి దోమల నివారణ మందులు పిచికారీ చేయాలన్నారు. వైద్యాధికారులు అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉండి ఇంటింటి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో కర్రి చంద్రరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

బాబోయ్... ఇదేమి ఎండ!

» శరీరం మంట పుట్టేలా వేడి

» ఉక్కపోతతో ప్రజలు సతమతం



పిఠాపురంలో నిర్మానుష్యంగా ఆర్అండ్‌బీ రహదారి

పిఠాపురం, జూన్ 18: రుతుపవనాలు ప్రవేశించాయి. ఇక వర్షాలు కురుస్తాయి అంటూ వాతావరణశాఖ తరచూ ఇస్తున్న సమాచారంతో వాతావరణం చల్లబడుతుందని ప్రజలు ఆశించారు. వాస్తవంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. శరీరం మంట పుట్టించేలా ఎండ తీవ్రత ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిని మరిపించేలా ఎండలు కాస్తున్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు పలు ప్రాంతాల్లో 5 రోజులుగా ఎండ తీవ్రతతో ప్రజలు సతమతమవుతున్నారు. మంగళవారం ఎండతీవ్రత మరింతగా పెరిగింది. 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా వాస్తవంలో 48 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత ఉన్న రీతిలో వాతావరణం ఉంది. ఉక్కపోతతో ఎండ కాస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం. ఉదయం నుంచి రాత్రి వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. ప్రజలు రోడ్డు మీదకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. పిఠాపురం, గొల్లప్రోలుల్లో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5గంటల వరకూ రోడ్లపై జనసంచారం అంతంత మాత్రంగానే కనిపించింది. ఎండ తీవ్రతతో శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదని, కనీసం రుతుపవనాల ప్రభావం ఎక్కడా కనిపించడంలేదని పలువురు అంటున్నారు.

కొత్తపల్లిలో వడగాల్పులు

కొత్తపల్లి, జూన్ 18: కొత్తపల్లి మండలంలో మంగళవారం వడగాల్పులు వీచాయి. ఎండ తీవ్రత అంతగా లేనప్పటికీ ఆకాశం మేఘావృతంగా ఉంది. దీంతో తీరం వెంబడి వేడి గాలులువీచాయి. వీధుల్లోకి వెళ్లగా మంటపక్కన నడిచి వెళ్లినంతగా వేడి గాలులు వీచాయి. దీంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు సాహసించలేదు. వేడి గాలులకు తట్టుకోలేని పర్యాటకులు మిట్టమధ్యాహ్నం 2గంటల సమయంలో ఉప్పాడ బీచ్‌లో సముద్రంలో జలకాలాటలు ఆడి చల్లదనం కోసం తపించారు. తీరం వెంబడి వేడి గాలులు తట్టుకోలేక సముద్రంలో స్నానాలు చేశారు.

దోమల నివారణకు చర్యలు



చేబ్రోలులో దోమల నిర్మూలన మందు పిచికారీ

గొల్లప్రోలు రూరల్, జూన్ 18: ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్టు వైద్యఆరోగ్యశాఖ మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసరు డేనియల్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఈబీసీ కాలనీలో బాలికల వసతి గృహం, బీసీ బాలుర వసతిగృహాల్లోని గదులు, ఆవరణలో దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ చేశారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజరు రమణమూర్తి, హెల్త్ అసిస్టెంటు సత్యకృష్ణ, ఆశా కార్యకర్తలు,వసతిగృహ సంక్షేమాధికారులున్నారు.

చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

గొల్లప్రోలు, జూన్ 18: గొల్లప్రోలు మండలం చేబ్రోలు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీల్లో ఉండి ఐదేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులకు పట్టాలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ, సూపర్‌వైజరు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

సర్పవరం జంక్షన్, జూన్ 18: అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ వివేకానంద క్లబ్ అధ్యక్షులు నవప్రసాద్ ఆధ్వర్యంలో జెడ్‌సీ రజనీ గౌరీ సోదరుడు జ్ఞాపకార్థం మంగళవారం స్థానిక జనావళి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 106 గవర్నర్ వనుం శ్రీనివాసరావు, అలయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్స్ మెంబర్‌షిప్ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, రీజియన్ చైర్‌పర్సన్ దుర్గా సుభద్ర, కే.సతీష్, గోపిరెడ్డి, శ్రీదేవి, గణేష్ తదితరులున్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

తుని రూరల్, జూన్ 18: తేటగుంట ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన టెక్స్‌బుక్స్, నోట్‌బుక్స్‌ను స్థానిక టీడీపీ, జనసేన నాయకులు విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు మాస్టారు, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు ఉన్నారు.

విద్యార్థికి అభినందన

తాళ్లరేవు, జూన్ 18: పదో తరగతి ఫలితాల్లో తాళ్లరేవు మండల టాపర్‌గా నిలిచిన ఇంజరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని బల్ల ఉషాఐశ్వరిని మంగళవారం టీడీపీ నేత ధూళిపూడి వెంకటరమణ అభినందించి బ్యాగ్ అందజేశారు. ఇంటర్మీడియట్ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రోత్సాహంతో చదివిస్తున్నట్లు తెలిపారు. టీడీపీనేతలు గుత్తుల వెంకటరమణ, దున్నా సుబ్రహ్మణ్యం, పితాని విష్ణు, దున్నా చంటి, శ్రీరాములు, ఉండ్రు చినబాబు, చిట్టూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు స్వీట్లు పంపిణీ

గొల్లప్రోలు, జూన్ 18: పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదేపల్లి వినీల్‌వర్మ పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య కార్మికులకు స్వీట్లు అందజేశారు. తహశీల్దార్ కార్యాలయం సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం తదితరులున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కిర్లంపూడి, జూన్ 18: మండలంలోని గెద్దనాపల్లిలో పాస్టర్ వై.మీకా సహకారంతో లివింగ్‌గాడ్ చర్చిలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఏలేశ్వరం మండలానికి చెందిన డాక్టర్ ఎస్.విజయబాబు, విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిఠాపురం క్రిస్టియన్ మెడికల్ సెంటర్ డైరెక్టర్ వై.అమృతలాల్ వైద్య బృందం సుమారు 80మందికి పరీక్షలు చేసి 23మందిని కంటి ఆపరేషన్‌కు ఆస్పత్రికి తరలించారు. మిగతా వారికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

గండేపల్లి, జూన్ 18: మండలంలోని యర్రంపాలెంలో రాయితీపై రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముత్యాల భాస్కరరావు, నాయకులు బిక్కిన వెంకటరమణ, ఇజ్జన లచ్చయ్య ఏవో సద్గురుమూర్తి, వీఏఏ ఎస్.సుమిత్ర, వీహెచ్ఏ సాయికిరణ్ పాల్గొన్నారు.

పైడిమల్లమ్మతల్లి పండుగ

రౌతులపూడి, జూన్ 18: మల్లంపేటలో పైడి మల్లమ్మతల్లి పండుగను గ్రామస్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మెక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

లేపాక్షిలో థీమాటిక్ ఎగ్జిబిషన్

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 18: కాకినాడ నాగమల్లి తోట జంక్షన్ వద్ద ఉన్న లేపాక్షి ఎంపోరియంలో ఈనెల 15న ప్రారంభమైన థీమాటిక్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తుందని ఎంపోరియం మేనేజర్ వీరబాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. తయారీదారులు నేరుగా తయారుచేసిన హస్తకళావస్తువులను ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తున్నారని,కళాకారులకు చేయూతనివ్వాలని ఆయన కోరారు.



ఎగ్జిబిషన్‌లో కొనుగోలుదారులు

ఎమ్మెల్యే నెహ్రూకు శుభాకాంక్షలు



నెహ్రూకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గండేపల్లి ఎంపీపీ

జగ్గంపేట, జూన్ 18: జగ్గంపేట మండలం కాట్రావులపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ బాబు శివచైతన్య, హెల్త్ సూపర్‌వైజర్ రేలంగి కనకరాజు జగ్గంపేట రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బొర్రంపాలెం సర్పంచ్ పోకల సుబ్బారావు ఉన్నారు. జగ్గంపేట మండలం సచివాలయాల సిబ్బంది నెహ్రూను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండల సచివాలయాల అధ్యక్షుడు పాలిపిరెడ్డి గోపి, మండల సెక్రటరీ పిల్ల మణికంఠ, మండల కోఆర్డినేటర్ కరీం పాల్గొన్నారు. అలాగే గండేపల్లి టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో నెహ్రూను గండేపల్లి మండల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్ శామ్యూల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు అధికారులు నెహ్రూకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, జగ్గంపేట ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ రాంజీ, పంచాయతీ సెక్రటరీ చిరంజీవి రాజు ఉన్నారు. గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే సత్యప్రభకు అభినందనలు



సత్యప్రభకు చిత్రపటం అందజేస్తున్న దామెర్ల

ప్రత్తిపాడు, జూన్ 18: ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా విజయం సాధించిన వరుపుల సత్యప్రభరాజాను మంగళవారం అన్నవరం దేవస్థానం పీపీ దామెర్ల కృష్ణారావు బొకేతో అభినందించి అన్నవరం ప్రసాదం, సత్యదేవుని చిత్రపటం అందజేశారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు, రాజాల చిట్టిబాబు, కొమ్ముల కన్నబాబు తదితర నాయకులు కలిసి అభినందించారు. మండలంలో వాకపల్లికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అలాగే ఇరిగేషన్, పోలీస్ శాఖ ఉద్యోగులు సన్మానించారు.

టీడీపీ ఫ్లెక్సీ చింపివేతపై ఫిర్యాదు

కోటనందూరు, జూన్ 18: కోటనందూరు మండలం ఎల్‌డీ పేట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు తుని టీడీపీ ఎమ్మెల్యే యనమల దివ్య ఫ్లెక్సీని చింపేశారు. ఈనెల 15న కొంతమంది యువకులు చింపివేసినట్టు, చర్యలు తీసుకోవాలని గెడ్డం విజయ్ కోటనందూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ దారుణ ఓటమి తట్టుకోలేక టీడీపీ ఫ్లెక్సీని చింపినట్టు ఎల్‌డీపేట టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

ఉపాధి హామీ పథకంలో అవకతవకలు

జగ్గంపేట రూరల్, జూన్ 18: మండలంలోని జె. కొత్తూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో అనేక అవకతవకలు జరిగాయి. పథకంలో పనిచేసిన కూలీల మస్తర్లు ఆన్‌లైన్ నుంచి తొలగించబడ్డాయి. దీంతో పని చేసిన కూలీలకు డబ్బులు వచ్చే పరిస్థితి లేదు. సుమారుగా 120 మంది కూలీల మస్తర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించినట్టు సమాచారం. ఏపీవో కృష్ణంరాజును వివరణ కోరగా పూర్తి వివరాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం ఏది?

తాళ్లరేవు, జూన్ 18: తాళ్లరేవు మండలంలో గాడిమొగలో రిలయన్స్, పి.మల్లవరంలో(జీఎస్‌పీసీ) ఓఎన్‌జీసీ సంస్థలు ఏర్పాటు సమయంలో ఆయా గ్రామాలను దత్తత తీసుకుని ప్రజలతో కొన్ని ఒప్పందాలను చేసుకున్నాయి. కానీ ఆ సంస్థల నుంచి పేద విద్యార్థులకు ప్రోత్సాహం అదడం లేదని తెలుస్తోంది. పి.మల్లవరం ఓఎన్‌జీసీ సంస్థ 2020 నుంచి 2024వరకు 54లక్షల45వేల రూపాయిలు ఓ కార్పొరేట్ కళాశాలకు బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేశారు. ఈ క్రమంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను కలిసి ఓఎన్‌జీసీ, రిలయన్స్ అందిస్తున్న ప్రోత్సాహక పథకంపై చర్చించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ సమస్యలను స్థానిక టీడీపీ నేత ధూళిపూడి వెంకటరమణ దృష్టికి తేగా ఆయన ఎమ్మెల్యేకు ఫోన్‌లో వివరించారు.

మంచినీటి ట్యాంకుల ప్రారంభమెప్పుడు?



ధర్మవరంలో ప్రారంభంకాని ఓవర్‌హెడ్ ట్యాంక్

ప్రత్తిపాడు, జూన్ 18: మండలంలోని జలజీవన్ మిషన్‌లో భాగంగా పూర్తయిన రక్షిత మంచినీటి పథకాలు ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్నాయి. మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, చినశంకర్లపూడి తదితర గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఒక్కో మంచినీటి పథకానికి రూ.63 లక్షలు పైబడి నిధులతో ఏడాది క్రితమే ఆయా గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. ఈ ట్యాంకుల నిర్మాణం పూర్తయినా ప్రారంభించడక పోవడంతో తక్షణం వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పార్కులకు పూర్వవైభవం తీసుకొస్తాం

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



చంద్రబాబు శతాబ్ది పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, జూన్ 18: పట్టణ పరిధిలో ఉన్న పార్కులకు పూర్వవైభవాన్ని తీసుకువస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన చంద్రబాబు శతాబ్ది పార్కు, అలాగే గుర్రాల సెంటర్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులను తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో శతాబ్ది పార్కును సర్వనాశనం చేశారని, రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన పార్కులను గాలికొదిలేశారన్నారు. అలాగే పట్టణాభివృద్ధిని పూర్తిగా పక్కనపెట్టేశారని, ఇకపై పట్టణాభివృద్ధిపై దృష్టిసారించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు స్థానిక మరిడమ్మ దేవస్థానంలో రాజప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, తూతిక రాజు, సకురు ప్రసాద్, బొడ్డు ఉదయ్‌శంకర్, కొరిపూరి రాజు, నూనే రామారావు, మేడిది శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ఆదినారాయణ, ఏఈ జీవప్రసాద్, శానిటరీ ఇనస్పెక్టర్ దావీ దురాజు తదితరులున్నారు.

వలంటీర్ల వ్యవస్థకు వ్యతిరేకం కాదు

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ



ఎమ్మెల్యే నానాజీని కలిసిన వలంటీర్లు

సర్పవరం జంక్షన్, జూన్ 18: ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకుంటూ వైసీపీ కార్యకర్తల్లా సేవలు చేసే వారికి వ్యతిరేకమని, వలంటీర్ల వ్యవస్థకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకం కాదని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. మంగళవారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసం వద్ద కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో గల గ్రామ, వార్డు వలంటీర్లు నానాజీని కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వలంటీర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బలవంతంగా తమతో వైసీపీ నాయకులు రాజీనామాలు చేయించారని, వాళ్లని నమ్మి మోస పోయామన్నారు. రాజీనామా చేయమని చెబితే వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని అప్పుడు మీ పోస్టులు ఉండవని స్థానిక నాయకులు హెచ్చరించారన్నారు. వలంటీర్ల సమస్యలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

జూలైలో ఎస్ఎఫ్ఐ రాజకీయ శిక్షణా తరగతులు

అరసం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాజు

కాకినాడ సిటీ, జూన్ 18: జూలై 8, 9, 10 తేదీల్లో కాకినాడ సూర్యకళామందిరంలో జరిగే ఎస్ఎఫ్ఐ రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని అరసం జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయు రాష్ట్ర నేత పి.సుబ్బరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనగా, ప్రత్యేక అతిథిగా ఏఐవైఎఫ్ మాజీ కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంపై దేశవ్యాప్త చర్చ జరగాలని కోరారు. వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ మార్కుల ఆధారితంగా వైద్య కళాశాలల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, పరిశ్రమలు లేక యువత వేరే రాష్ట్రాలకు తరలిపోతున్నారన్నారు, అందువల్ల ముఖ్యమంత్రి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కాశీవిశ్వనాథ్, ఏఐటీ యుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నగర కన్వీనర్ ఎంస్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కాకినాడ రూరల్, జూన్ 18: విశాఖపట్నంలోని ఏపీ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీసంస్థ సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ సబ్‌డివిజన్ కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ప్రత్యేక విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణ, ఆర్థికసభ్యులు శ్రీనివాస్, స్వతంత్రసభ్యులు సురేంద్రకుమార్, సాంకేతికసభ్యులు జనార్ధనరావు తదితర అధికారులతో నిర్వహిస్తామన్నారు. డివిజన్, సబ్‌డివిజన్, సెక్షన్ అధికారులు హాజరవుతారని.. వినియోగదారులు తమకు సంబంధించి పరిష్కారంకాని సమస్యలను రాతపూర్వక ఫిర్యాదు ద్వారా తెలియజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

రేపు ఐటీఐ విద్యార్థులకు ఇంటర్వ్యూలు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 18: కాకినాడ జిల్లా ఐటీఐ (ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ) ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2024-25 సంవత్సరానికిగాను ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఉదయం 9గంటలకు కాకినాడ ప్రభుత్వ పారిశ్రామికా శిక్షణా సంస్థలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థకు ఈ కింది తెలిపిన షెడ్యూల్ ప్రకారం హాజరవ్వాలన్నారు. 20న ఉదయం 9గంటల నుంచి జీపీయే 10 నుంచి 8.2 వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జీపీయే 8.1 నుంచి 7 వరకు, 21న ఉదయం 9గంటల నుంచి జీపీయే 6.9 నుంచి 6.4వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జీపీయే 6.3 నుంచి 5.8వరకు, 22న ఉదయం 9గంటల నుంచి జీపీయే 5.7 నుంచి 5.3 వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జీపీయే 5.2 నుంచి 4.8వరకు, 23న ఉదయం 9గంటల నుంచి జీపీయే 4.7 నుంచి 4.2 వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జీపీయే 4 నుంచి 3 వరకు, 24న ఉదయం 9గంటల నుంచి జీపీయే 10 నుంచి 7వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జీపీయే 6.9 నుంచి 5.8 వరకు, 25న ఉదయం 9గంటల నుంచి జీపీయే 5.7 నుంచి 4.8 వరకు, మధ్యాహ్నం 4.7 నుంచి 3 వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఆక్వా సాగుపై అధికారుల విచారణ

కరప, జూన్ 18: నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా సాగు చేపడుతున్నారంటూ పలువురు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయా శాఖల అధికారులు విచారణ చేపట్టారు. కరప శివారు రామకంచిరాజునగర్‌కాలనీ ఎదురుగా కొంతమంది ఆక్వా చెరువులు సాగుచేస్తున్నారు. అయితే పక్కనే ఉన్న పంటకాలువ గట్లను ఆక్రమించి ఆ చెరువులకు గట్లు వేశారని, దీనివల్ల పంటభూములు దెబ్బతింటున్నాయని, తుఫాన్ల సమయంలో పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఇటీవల అధికారులకు ఫిర్యాదుచేశారు. అలాగే పక్కనే ఉన్న డ్రెయిన్‌లోకి వ్యర్థ జలాలు వదిలేస్తుండడంతో పూడుకుపోతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకినాడ మత్స్యశాఖ ఎఫ్‌డీవో ఆర్.నూకరాజు, ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ఉమామహేశ్వరరావు, డ్రైనేజీశాఖ ఏఈ కీర్తి, ఇరిగేషన్ ఏఈ నాగిరెడ్డి భవానీ, ఏవో రాజేష్, ఆర్ఐ పేపకాయల మాచరరావు మంగళవారం చెరువుల వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. పలుచోట్ల పంటకాలువ గట్టును ఆక్రమించి చెరువులకు గట్లు ఏర్పాటు చేసినట్టుగా గుర్తించామని, దీనిపై ఆక్వా సాగుదారులకు నోటీసులు జారీచేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.